క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



కంటివైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని కాకతీయ సత్రంలో బుధవారం శావి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఐఎన్‌సీ(ఫ్లోరిడా),సహకార్ సొల్యూషన్స్ అండ్ టెక్నాలజీ ఎల్‌ఎల్‌పీ (హైదరాబాద్)సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గణేశుని రత్తయ్య చౌదరి స్మారకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సత్రం నిర్వాహకులు తెలిపారు. డాక్టర్లు కృష్ణచైతన్య, ప్రపుల్ల, కల్యాణి, సతీష్, రాము, రఘుప్రసాద్ తదితరులు సుమారు 250 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని నాయుడు ఉష, లక్ష్మి పర్యవేక్షించారు.

కొలనుభారతిలో నేడు వేలం పాటలు

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి క్షేత్రంలో వివిధ దుకాణాలను నిర్వహించేందుకు గురువారం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ మోహన్ బుధవారం తెలిపారు. క్షేత్రంలో టెంకాయలు అమ్ముకొనుటకు, మిశ్రమ బియ్యం, కొబ్బరి గిన్నెలు పోగుచేసుకొనుట, అక్షరాభ్యాసము, పూజా సామగ్రి సెట్టు సమకూర్చు హక్కుల కోసం వేలంపాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనదలచి వారు రూ.5,000 ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలం దక్కించుకున్నవారు 19, మే 2023 నుంచి 18, మే,2024 సంవత్సరం వరకు అంగళ్లు నిర్వహించుకోవచ్చునని తెలిపారు.

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో బుధవారం షష్ఠిని పురస్కరించుకుని ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దర్శించుకున్నారు. ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైనేజీ శుభ్రం చేయిస్తున్న కమిషనర్ కిషోర్

నందికొట్కూరు: పట్టణంలోని వార్డు సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. బుధవారం పట్టణంలోని 15వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటించారు. ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ సాధారణ సమావేశంలో తీర్మానంలో ఉంచుతామన్నారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి



నాగశేషారెడ్డి (ఫైల్)

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన నరాల.నాగేషారెడ్డి(54) 30 ఏళ్లుగా భారత ఆర్మీజవాన్ (సీఆర్‌పీఎఫ్ కమాండెంట్)గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే సంవత్సర కాలంగా తలలో సమస్య ఉండి అనారోగ్యానికి గురయ్యాడు. హైదారాబాద్‌లోని ఆర్మీ హాస్పిటల్‌లో తలకు సర్జరీ చేయించుకొని మరలా 6 నెలలు ఆర్మీలో విధులు నిర్వర్తించాడు. అయితే నెలరోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఇంటికి తిరిగి వచ్చాడు. కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్‌లోని ఆర్మీ హాస్పిటల్‌లో వైద్యం కోసం చేర్పించారు. చికిత్స పొందుతూ కొలుకోలేక బుధవారం మృత్యువాత పడ్డాడు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహన్ని స్వగ్రామమైన గువ్వలకుంట్లకు తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య శివలింగమ్మ, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం

- నందికొట్కూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం
- వర్షపు నీటితో తడిసిన ధాన్యం
- దిగుబడులను కాపాడుతునేందుకు రైతన్నల అవస్థలు



పగిద్యాలలో వరి ధాన్యాన్ని కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్న రైతులు

జూపాడుబంగ్లా: నియోజకవర్గంలో బుధవారం వేకుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షం మండే ఎండల తీవ్రత నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించినప్పటికీ రైతన్నలను మాత్రం నిరాశకు గురిచేసింది. అకాలంగా కురిసిన భారీ వర్షంతో రైతులు అతలాకుతలమయ్యారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు సతమతమయ్యారు. మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తర్తూరు, మండ్లెం, తూడిచెర్ల, పారుమంచాల, తరిగోపుల, 80బన్నూరు తదితర గ్రామాల్లో కురిసిన వర్షం 56.8మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన వర్షం ఏకధాటిగా గంటపాటు కురవటంతో మండ్లెంలో ఎర్రవాగు వర్షం నీటితో ప్రవహించగా, కేసీకి నీళ్లొచ్చాయా అన్నట్లుగా కాల్వలో వర్షపు నీరు ప్రవహించింది. చివరిదశలో ఉన్న రబీ సీజన్ పంటల నూర్పిళ్ల వర్షంలో తడిసిపోయాయి. చేతికందిన ధాన్యం మరో రెండు, మూడు రోజుల్లో విక్రయించుకుందామన్న తరుణంలో వర్షానికి తడవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గించి ధాన్యం కొంటుండగా, తడిసిన ధాన్యాన్ని మరింత ధర తగ్గించి అడుగుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తడిసి ముద్దయిన వరి ధాన్యం

పగిద్యాల: బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల కుండపోత వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయింది. కల్లాల్లోకి చేరిన వరి ధాన్యాన్ని వర్షం తాకిడి నుంచి కాపాడుకోవడానికి రైతులు పడిన బాధలు వర్ణనాతీతం. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి పండించుకున్నా ధాన్యం కళ్లెదుటే వర్షార్పణం అయ్యిందని కన్నీటిపర్యంతమయ్యారు. మండల వ్యాప్తంగా 60.8 మీ.మీ. వర్షపాతం నమోదు కావడం వలన పొలాల్లో కోసి కొయ్యల మీద వేసిన వరి ఓజలు కూడా నీట మునిగాయి. అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని మండల రైతాంగం కోరుతున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ కార్యాలయాలైన విద్యాశాఖ, భవిత కేంద్రం, ఉపాధి హామీ, వైఎస్సార్ క్రాంతి పథం, తహసీల్దార్ కార్యాలయాలు జలమయంగా మారాయి. దీంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నట్టేట ముంచిన అకాల వర్షం

నందికొట్కూరు: బుధవారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షం రైతులను నట్టేట ముంచేసింది. నియోజకవర్గంలో రబీ సీజన్‌లో 20 హెక్టార్లలో మొక్కజొన్న, 10 హెక్టార్లలో వరి పంటలు సాగు చేశారు. పంట కోతలు పూర్తి చేసుకొని విక్రయానికి సిద్ధమవుతుండగా వర్షం కురవడంతో దిగుబడులు తడిసి ముద్దవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో, రోడ్లపై దిగుబడులను ఆరబోసి, వర్షం వచ్చినప్పుడు కవర్లు వేశారు.

అరటితోట నేలమట్టం

కొత్తపల్లి: మండలంలో బుధవారం తెల్లవారుజామున భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. మండలంలోని ఎర్రమఠం, గుమ్మడాపురం, ముసలిమడుగు, శివపురం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, గువ్వలకుంట్ల, వీరాపురం గ్రామాలతో పాటుగా మండల కేంద్రంలో 3.3 సెం.మీల వర్షపాతం నమోదయిందని ఏఎస్ఓ రమేష్ తెలిపారు. ఈ ఉరుములు, మెరుపుల దాటికి సింగరాజు పల్లె గ్రామంలో ఓ రైతుకు చెందిన కలం దొడ్డిలో ఉన్న చెట్టుపై పిడుగుపడింది. జనాలు లేకపోవడంతో ఏప్రమాదం సంభవించలేదు. అయితే మునగ, అరటి తోటలు వర్షానికి నేలమట్టమయ్యాయి.



పగిద్యాలలో కల్లంలో ఆరబోసిన పండు మిరప తడిసిపోయిన దృశ్యం



గోకవరం సమీపంలో నెలవాలిన అరటితోట

5.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

పాములపాడు: బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షం 5.6మిల్లీ మీటర్లుగా నమోదైంది. ఆకాశంలో మెరుపులు, ఉరుములు ప్రజలను భయకంపితులను చేశాయి. ఈ వర్షం వేసవి దుక్కులకు ఎంతో అనుకూలం. అయితే ఇప్పటికి పొలాల్లో ఉన్న పైర్లు వర్షం, గాలుల వల్ల దెబ్బతిన్నాయి.



జూపాడుబంగ్లాలో మొక్కజొన్న ధాన్యం తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం



మండ్లెంలో వర్షం నీటితో పారుతున్న ఎర్రవాగు

మిడుతూరులో 24.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు పీరుసాహెబ్‌పేట, దేవనూరు, చింతలపల్లి, చౌట్కూరు తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బుధవారం తెల్లవారుజామున కురిసింది. 24.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మొక్కజొన్న తడిసిపోయింది



రబీ సీజన్‌లో 6 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసాను. ఈ సారి దిగుబడి ఆశించినా స్థాయిలో వచ్చింది. అకాల వర్షం మొక్కజొన్న కంకులు ఆరాలంటే కనీసం వారం రోజులు పడుతుంది. వర్షం కురుస్తుండడంతో మొక్కజొన్న గింజలు ముక్కి పోతాయని భయంగా ఉంది. – శేఖర్, రైతు, తంగడంచ

మూడెకరాల్లో అరటి పంట నాశనం



నేను మూడు ఎకరాల్లో అరటి పంటసాగు చేసుకున్నాను. పంట కాయలుకాసి చివరిదశలో ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షానికి మొత్తం అరటి మొక్కలు నెలమట్టం అయ్యాయి. పంటసాగుకోసం రూ.3లక్షలు ఖర్చు చేశా. చేతికాడికి వచ్చేసరికి పంటమొత్తం వర్షందాటికి నాశనంఅయ్యింది. – పుల్యాల ఉశేన్‌రెడ్డి, రైతు గోకవరం గ్రామం

మెనూ ప్రకారం భోజనం వండిపెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ

జూపాడుబంగ్లా: మెనూ ప్రకారం విద్యార్థులకు పాఠశాలల్లో నాణ్యమైన భోజనం వండిపెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ ఆదేశించారు. బుధవారం ఆమె పారుమంచాల గ్రామంలోని ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె స్వయంగా అన్నాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు చిక్కీలు, అరటిపండ్లు, గుడ్లు నిర్ణీత రోజుల వారీగా అందజేయాలని వంటనిర్వాహకులకు సూచించారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు పారుమంచాలలో 24గంటల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిరుపయోగంగా ఉన్న పాత భవనాలను జెడ్పీ పాఠశాలకు కేటాయించేందుకు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఎంఈఓ మోహన్, సీఆర్పీ బాలస్వామి తదితరులు ఉన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

బండిఆత్మకూరు : ఎ.కోడూరు గ్రామంలో ఉర్దూ పాఠశాల చుట్టూ ప్రహరీ గోడను దాతల సహకారంతో నిర్మిస్తున్నట్లు ముస్లిం మైనారిటీ నాయకులు అన్వర్‌ఖాన్ తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించి భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. అన్వర్‌ఖాన్ మాట్లాడుతూ సుమారు 60 మీటర్ల మేర రూ. 6 లక్షల వ్యయంతో గోడను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక షాదీఖానా నిర్మాణం కూడా చేపడతామన్నారు.

చల్లబడిన వాతావరణం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండవేడిమితో ఇబ్బందులు పడ్డ ప్రజలు ఈ వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లడడంతో ఉపశమనం పొందారు. ఈ వర్షం 27.8 మిమీగా నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెలుగోడు: మండలంలో బుధవారం తెల్లవారుజామున వీచిన భారీ ఈదురు గాలులు, వర్షానికి పలు గ్రామాలలో కరెంటు లేక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ ఈదురుగాళ్లకు మామిడికాయలు భారీ స్థాయిలో నెలరాలడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. అటవీ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో పగలంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో అధికారులు సాయంత్రం 5.30 గంటలకు కరెంటు పునరుద్ధరించారు.

ప్రతి గడపకు సంక్షేమం

నందికొట్కూరు: పార్టీలకు అతీతంగా ప్రతి గడ పకూ సంక్షేమం, అభివృద్ధి చేరువ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని కౌన్సిలరు షేక్ నాయబ్, వైఎస్సార్‌సీపీ నాయ కులు కిరాణం మన్సూర్, ఉస్మాన్‌బేగ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 7, 27వ వార్డుల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ పథకాలు వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మండ్లెం పొలాలకు నీరివ్వాలి

జూపాడుబంగ్లా: నాగటూరు ఎత్తిపోతల పథకం నుంచి మండ్లెం గ్రామంలోని 2వేల ఎకరాలకు సత్వరమే సాగునీటినివ్వాలని గ్రామ రైతులు బుధవారం జలదీక్ష చేపట్టారు. నాగటూరు ఎత్తిపోతల పథకం ద్వారా భాస్కరాపురం, మండ్లెం గ్రామాల పరిధిలో 2వేల ఎకరాలకు సాగునీటిని ఇవ్వాల్సి ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నా సాగునీటిని ఇవ్వటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన నందికొట్కూరు నియోజకవర్గ గ్రామాల ప్రజలు చుట్టూ నీరున్నా తాగు, సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు ప్రసాదు, దాసు, ఈశ్వరయ్య, చిన్నవెంకటేశ్వర్లు, ప్రభుదాసు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఆత్మకూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేషస్పందన



వృద్ధురాలికి మంజూరవుతున్న ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని 21, 22 వార్డుల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి పనులు ముఖ్యమంత్రి చేస్తూ ప్రజలపై వరాల జల్లు కురిపిస్తున్నారన్నారు. పట్టణంలో నూతన సీసీ రోడ్ల ఏర్పాటుతో పాటు అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు 21,22 వార్డుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు ఘనస్వాగతం పలికారు. గజమాలలు, పూలతో స్వాగతం పలికి దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, వైస్ చైర్మన్లు రాజగోపాల్, పువ్వాడ భాస్కర్, కో ఆప్షన్‌సభ్యులు రషీద్, ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ప్రకాష్ బాబు, వార్డు కౌన్సిలర్లు బోయలక్ష్మమ్మ, బోయశివపార్వతి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ జాతరకు ఆహ్వానం

మహానంది: గాజులపల్లె గ్రామంలో వచ్చే నెల 2,3వ తేదీల్లో జరిగే పెద్దమ్మతల్లి జాతర మహోత్సవానికి రావాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఆహ్వానం అందించారు. మహేంద్ర(మేదర) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి ఎల్లాలబాబు బుధవారం ఆత్మకూరు పట్టణంలో ఎమ్మెల్యే శిల్పాను కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

సచివాలయాలతో ప్రజలకు సత్వర సేవలు

శ్రీశైలంటెంపుల్: గ్రామ సచివాలయాలతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. బుధవారం శ్రీశైలంలో నూతన సచివాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా సచివాలయ ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యేకు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పూలమాలలతో, పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనస్వాగతం పలికారు. అనంతరం నూతన సచివాలయానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, ఎమ్మెల్యే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, పంచాయతీ కార్యదర్శి గదిని ప్రారంభించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో స్వయంగా ఎమ్మెల్యే శిల్పా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించుకున్నారు. అలాగే సచివాలయం వద్ద స్థానిక ప్రజల కోసం నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కొత్తపేట, శ్రీగిరికాలనీలో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర మ్యాప్‌లో శ్రీశైలం మండలం గుర్తింపు లేని మండలంగా ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే శ్రీశైలం మండలంలో వలంటీర్లను ఏర్పాటు చేసేందుకు అవకాశము లేకుండా పోయిందని అన్నారు. శ్రీశైలం మండలం గ్రామపంచాయతీగా గుర్తింపు లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మండలానికి 170వలంటీర్ పోస్టులు, సున్నిపెంటకు-3, శ్రీశైలానికి-1 సచివాలయం మంజూరు చేయించానని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్ కుమార్, సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ గంగయ్య, పంచాయతీ సెక్రెటరీ బాలునాయక్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్, మండల ఇన్‌చార్జ్ భరత్‌రెడ్డి, నాయకులు టీఎండీ రఫి, విష్ణు, ఏడుకొండలు, అనిల్‌రెడ్డి, కుమార్, కృష్ణారెడ్డి, ప్రభావతి, సవమ్మ, కొటమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విలేజ్‌హెల్త్‌క్లినిక్ లో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే

హిందూ సంప్రదాయాలు గొప్పవి



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున ఈఓ, చైర్మన్

మహానంది: భారతదేశ సంస్కృతీ, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని పరిరక్షించుకునేందుకు ఏపీ దేవదాయశాఖ కృషి చేస్తుందని అర్చక ట్రైనింగ్ డైరెక్టర్ వేదాంతం గోపాలచక్రవర్తి అన్నారు. మహానందిలో ఏపీ దేవదాయశాఖ, మహానంది దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో రెండ్రోజుల అర్చకుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. మహానంది ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ చీఫ్ కోఆర్డినేటర్ వీఎం చక్రవర్తి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అర్చకులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

మిడుతూరు: మండలపరిధిలోని అలగనూరు తెలుగు గంగ కాల్వ సమీపంలో ఓ వ్యక్తి ద్వి చక్రవాహనంపై అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పాములపాడు గ్రామానికి చెందిన కృష్ణుడు కుమారుడి వివాహానికి పెండ్లి పత్రికలు పంచడానికి మిట్టకందాల నుంచి బయలుదేరారు. రేగడగూడురు – అలగనూరు రహదారిలో తెలుగంగ కాలువ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



వీపనగండ్ల సర్పంచ్ భారతికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ

మిడుతూరు: సమస్యలకు పరిష్కారం చూపని సమావేశాలెందుకని మండల సర్వసభ్య సమావేశంలో పలు గ్రామాల సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యుత్ ఏఈ క్రాంతి కుమార్ విద్యుత్ శాఖకు సంబంధించిన విషయాలపై చర్చ జరుగుతుండగా.. బైరాపురం గ్రామ సర్పంచ్ ఫణిభూషణ్‌రెడ్డి కేక్ కట్ చేసేందుకు తీసుకొని వచ్చారు. ఎందుకు కట్ చేస్తున్నారో తెలపాలని ఎంపీడీఓ కోరారు. కేక్ కట్ చేసిన తర్వాత సమస్యను విన్నవిస్తానని చెప్పడంతో కేక్ కట్‌చేసేందుకు ఎంపీడీఓ ససేమిరా అన్నారు. దీంతో బైరాపురం సర్పంచ్ సంవత్సరం కింద ఇదే రోజు సమస్యను మీ దృష్టికి తీసుకువచ్చినా నేటికీ పరిష్కారం కాలేదని, వర్గవిభేదాలతో సమస్యను పరిష్కరించడం లేదని ఎంపీడీఓను ప్రశ్నించారు. సింగిల్ విండో చైర్మన్ నాగతులసి రెడ్డి మధ్యలో కల్పించుకొని సమస్య పరిష్కారం కానిబో సభను వాకౌట్ చేసి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేద్దామని తోటి ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా గ్రామాల్లో సర్పంచ్‌లను గ్రామ వలంటీర్లు లెక్కచేయడం లేదని సింగిల్ విండో చైర్మన్ నాగతులసిరెడ్డి, బైరాపురం సర్పంచ్ ఫణిభూషణ్‌రెడ్డి, పీరుసాహెబ్ పేట సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, తిమ్మాపురం సర్పంచ్ నాగస్వామిరెడ్డి ఎంపీడీఓతో వాగ్వాదానికి దిగారు. దీంతో సమావేశం రసాభాసగా సాగింది. స్పందించిన ఎంపీడీఓ మెజార్టీ పీపుల్స్ సంతకాలు చేస్తే వలంటీర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు వారి పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ ఆదేశించారు. గత సర్వసభ్య సమావేశాలలో పలువురు ప్రజాప్రతినిధులు అడిగిన సమస్యలపై ఇప్పటికి పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. శాఖల వారీగా పరిష్కారానికి చొరవచూపాలని సూచించారు. అనంతరం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా లక్ష్యాలు సాధించిన గ్రామ పంచాయతీలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, పీఆర్ గని బాబు, ఎంఈఓ మౌలాలి, ఏఓ పీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ





కరిష్మా (968), సమీన (935) శివాని (409)

ప్రభుత్వ కళాశాల, ఆత్మకూరు కస్తూర్బా

ఆత్మకూరు: ఇంటర్ మొదటి, రెండో సంవత్సర పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు తెలిపారు. సెకెండియర్ ఎంపీసీలో కరిష్మా 1000 మార్కులకు గాను 968, సీఈసీలో సమీన వెయ్యికి గాను 935 మార్కులు సాధించారన్నారు. అలాగే హెచ్ఈసీలో షైకున్ 882, బైపీసీలో వెంకటేశ్వర్లు 810, ఎం.పీ.హెచ్.డబ్ల్యూ నేహా 951, సాల్మన్ బేగ్ 939 మార్కులు సాధించారని చెప్పారు. మొత్తం 99 మంది విద్యార్థులు సెకెండ్ ఇయర్ పరీక్షలకు హాజరుకాగా 48 మంది ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో షాహిద్ 470కి 410, హెచ్ఈసీలో గోవర్ధిని 500లకు 413, హైమావతి ఎంపీహెచ్‌డబ్ల్యూలో 500 లకు 465 మార్కులు, సీపీఅండ్ఎమ్ గ్రూప్‌లో రాజు 500 లకు 476 మార్కులు సాధించినట్లు చెప్పారు.

కస్తూర్బా కళాశాలలో

పట్టణంలోని కస్తూర్బా కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు అధిక మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు. బైపీసీలో 25 మంది విద్యార్థులకు గాను 16 మంది పాస్ అయ్యారన్నారు. తమ కళాశాలకు చెందిన శివానీ 440 మార్కులకు గాను 409 మార్కులు సాధించిందని చెప్పారు.

తిమ్మాపురం మోడల్ స్కూల్ విద్యార్థులు

మహానంది: ఇంటర్ ఫలితాల్లో తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థినులు ఉత్తమ మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 49 మందికి 21 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరంలో 66 మందికి 30 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మొదటి సంవత్సరంలో డి.లావణ్య 395 మార్కులు, రెండో సంవత్సరంలో ఎం. సుప్రాదిక 857 మార్కులు, పర్దీన్‌ఖాన్ 832 మార్కులు సాధించారన్నారు. ఇదిలా ఉండగా తిమ్మాపురంలోని కస్తూర్బా పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మాత్రమే ఉత్తీర్ణులయినట్లు ప్రిన్సిపాల్ భవానీ తెలిపారు. మొదటి సంవత్సరంలో భవిత 386 మార్కులు, భాగ్యలక్ష్మి 340 మార్కులు సాధించారని చెప్పారు.

తగ్గిన ఉత్తీర్ణత శాతం

మిడుతూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయసంవత్సరం ఫలితాలలో 40 శాతం ఉత్తీర్ణత, ప్రథమ సంవత్సరం ఫలితాలలో 15 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ తెలిపారు. ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూపులో సుమంత్ 437 మార్కులు సాధించాడన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరం 35 శాతం, ద్వితీయ సంవత్సరంలో 51 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో మహమ్మద్ హంజా 436, మధుశేఖర్ 430, మహి 424, బైపీసీలో గాయిత్రి 420 మార్కులు సాధించారని చెప్పారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బాలరామ కృష్ణ 844, ఉనేజ 808 మార్కులు, బైపీసీలో లక్ష్మీప్రసన్న 852, గాయిత్రి 836, ఎంఈసీలో జ్యోతిర్మయి 868 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.